APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ గురువారం 23, జూలై 2026 సంపుటి: 01 సంచిక :56 పేజీలు : 04 వెల: 2-00/-



## స్కోప్జేలో గాంధీ విగ్రహావిష్కరణ

- **భారత్, ఉత్తర మాసిడోనియా అధ్యక్షుల చేతుల మీదుగా ఆవిష్కరణ**
- **స్నేహబంధానికి చిరస్థాయి ప్రతీకగా నిలుస్తుందని ఆశాభావం**
- **శాంతి, సహనం, మానవత్వానికి ఉమ్మడి నిబద్ధతకు నిదర్శనం**

స్కోప్జే, జూలై 22 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉత్తర మాసిడోనియా అధ్యక్షురాలు గోర్దానా సిల్జనోవ్స్కా-డావ్కోవా కలిసి స్కోప్జే మ్యూజియంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం భారత్--ఉత్తర మాసిడోనియా ద్వైపాక్షిక సంబంధాలకు మరింత బలాన్ని చేకూర్చే సందర్భంగా నిలిచింది. విగ్రహావిష్కరణ అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ మహాత్మా గాంధీ విగ్రహం ఇరు దేశాల మధ్య స్నేహబంధానికి చిరస్థాయి ప్రతీకగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. శాంతి, సహనం, మానవత్వం వంటి విలువల పట్ల భారత్, ఉత్తర మాసిడోనియా ఉమ్మడి నిబద్ధతను ఈ విగ్రహం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ ప్రపంచానికి అందించిన అహింస, సత్యం, సామరస్య సందేశాలు నేటికీ సమకాలీనమని రాష్ట్రపతి తెలిపారు. దేశాల మధ్య పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, మానవీయ విలువలను బలోపేతం చేయడంలో గాంధీ సిద్ధాంతాలు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. స్కోప్జే మ్యూజియంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం ద్వారా భారతీయ సంస్కృతి, చారిత్రక వారసత్వం, గాంధేయ తత్వం గురించి అంతర్జాతీయ సమాజానికి మరింత అవగాహన కలుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ఇరు దేశాల సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

# భోగాపురానికి మోదీకి ఆహ్వానం

- <u>ప్రధానితో భేటీ అయిన సీఎం చంద్రబాబు నాయుడు</u>
- <u>ఆగస్టు 1న విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం</u>
- <u>ఏర్పాట్లపై ప్రత్యేక అధికారుల నియామకం</u>



న్యూఢిల్లీ, జూలై 22 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన ఈ భేటీలో ఆగస్టు 1న జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్ర-యం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుగా నిలుస్తుందని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి తప్పక హాజరు కావాలని వారు కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమ నిర్వహణను సమన్వయం చేసేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్‌లకు వివిధ బాధ్యతలు అప్పగించారు. ప్రజా సౌకర్యాలు, పారిశుద్ధ్యం, రవాణా, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఈ అధికారులతో పాటు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు.



## రాజమహేంద్రవరం కోర్టులో దేవినేని ఉమా హాజరు

- **2022లో నమోదైన కేసు విచారణకు కోర్టుకు హాజరు**
- **<u>వైసీపీ హయాంలో నమోదైన కేసుగా వ్యాఖ్య</u>**

రాజమహేంద్రవరం, జూలై 22: 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపై నమోదు చేసిన కేసు విచారణ నిమిత్తం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమా మహేశ్వరరావు బుధవారం రాజమహేంద్రవరంలోని రెండో అదనపు జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కూడా ఆయనతో కలిసి కోర్టుకు వెళ్లారు. దేవినేని ఉమా తెలిపిన వివరాల ప్రకారం, 2022లో వైసీపీ ప్రభుత్వ హయాంలో భారతీయ న్యాయ సంహితకు పూర్వం అమలులో ఉన్న శిక్షాస్మృతిలోని సెక్షన్ 269 కింద 447/2022 సంఖ్యతో తనపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఆ కేసు విచారణలో భాగంగానే న్యాయస్థానం ఎదుట హాజరైనట్లు తెలిపారు.

# పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు



- **'మన ఇల్లు - మన లోకేష్'లో రెండో రోజు పట్టాల పంపిణీ**
- **మంగళగిరి ప్రజల దశాబ్దాల కల నెరవేరుతోందన్న లోకేశ్**
- **ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని స్పష్టం**

మంగళగిరి, జూలై 22: 'మన ఇల్లు - మన లోకేష్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో రెండో రోజు మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మంగళగిరి ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న శాశ్వత ఇంటి పట్టాల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోందని లోకేశ్ అన్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించడం వల్లే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు .మంగళగిరి ప్రజలే తన కుటుంబమని, వారి ప్రేమాభిమానాలు, ఆశీస్సులే తనకు కొండంత బలమని లోకేశ్ తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి చెప్పారు. సొంత ఇంటి హక్కు కల్పించడం ద్వారా వేలాది కుటుంబాలకు భద్రమైన జీవనానికి పునాది వేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ ప్రాంగణంలో హర్షాతిరేక వాతావరణం నెలకొంది. మంగళగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్

కదిరి జూలై 22: పట్టణంలోని వీవర్స్ కాలనీలో గౌరవ చీణూ కూటమి శాసనసభ్యులు శ్రీ కందికుంట వెంకట ప్రసాద్ గారు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ తలుపుల గంగాధర్ గారు, కిసాన్ మోర్చా హార్టికల్చర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీ సామాల కేశవరెడ్డి గారు, కదిరి పట్టణ అధ్యక్షులు శ్రీ పీట్ల రామకృష్ణ గారు, షేక్ సమీవుల్లా గారు, రమణ గారు మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంత సూర్య
తెలుగువార్త
గురువారం 23 జూలై 2026

# పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి 5కే రన్ రైడ్ గ్రాండ్ ఫినాలే 26న





**• టీ-షర్ట్, బిబ్, ఫినిషర్ మెడల్ ఆవిష్కరణ**
**• ఆర్.జె. రత్నాకర్, నిమిష్ పాండ్యా జెండా ఊపనున్నారు**

పుట్టపర్తి, జూలై 22 అనంత సూర్య: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దివ్య జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, భారతదేశం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "శ్రీ సత్యసాయి 5కే రన్ ఽ రైడ్--2026 -- ఎ స్పిరిట్ ఆఫ్ యూనిటీ" జాతీయ ఉద్యమానికి ముగింపు ఘట్టమైన గ్రాండ్ ఫినాలే కార్యక్రమం ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 5.30 గంటలకు పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక టీ-షర్ట్, బిబ్ , ఫినిషర్ మెడల్‌ను శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా సమన్వయకర్త ఎస్. కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు, రాష్ట్ర యువజన సమన్వయకర్త సి. గౌతమ్, జిల్లా అధ్యక్షుడు ఎస్. రామచంద్రరావు, జిల్లా యువజన సమన్వయకర్త సురేష్ తదితరులు పాల్గొన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా బోధించిన లవ్ ఆల్ సర్వ్ ఆల్, హెల్ప్ ఎవర్ హర్ట్ నేవర్" సందేశాన్ని ఆచరణలో ప్రతిబింబిస్తూ ఐక్యత, ఆరోగ్యం, మానవతా విలువలు, ఫిట్ ఇండియా ఉద్యమానికి ప్రేరణగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రధాన నగరాల్లో జరిగిన ఈ ఉద్యమంలో ఇప్పటికే 1.10 లక్షలకు పైగా యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, భక్తులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో జరిగే గ్రాండ్ ఫినాలేకు ఆర్.జె. రత్నాకర్, అఖిల భారత అధ్యక్షుడు నిమిష్ పాండ్యా జెండా ఊపి ప్రారంభించనున్నారు. కేంద్ర ట్రస్ట్ ట్రస్టీలు, సేవా సంస్థల జాతీయ, రాష్ట్ర స్థాయి పదాధికారులు, విశిష్ట అతిథులు, దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. రూట్ హిల్ వ్యూ స్టేడియం నుండి పుట్టపర్తి ప్రధాన రహదారి మీదుగా గణేష్ సర్కిల్ , ప్రశాంతి పెట్రోల్ బంక్, (విమానాశ్రయం సమీపం) తిరిగి హిల్ వ్యూ స్టేడియం. పాల్గొనేవారికి సూచనలు. జూలై 24, 25 తేదీల్లో ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉచిత టీ-షర్ట్, బిబ్ పంపిణీ. జూలై 26న ఉదయం 5.15 గంటలకల్లా హిల్ వ్యూ స్టేడియానికి చేరుకోవాలి. 5కే సైకిల్ రైడ్‌లో పాల్గొనేవారు సొంత సైకిళ్లతో రావాలి. ప్రతి ఫినిషర్‌కు మెడల్, ఈ-సర్టిఫికెట్, అల్పాహారం అందజేయనున్నారు.

# ఏ హోదాలో పనిచేసినా ప్రత్యేకత చాటుకోవాలి



**జెడ్పీ డిప్యూటీ సీఈఓ కృష్ణమూర్తి**

అనంతపురం, జూలై 22 అనంత సూర్య: తాము ఏ హోదాలో పనిచేసినా అంకితభావం, చిత్తశుద్ధి, నిబద్ధతతో విధులు నిర్వర్తించినప్పుడే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఉమ్మడి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ కృష్ణమూర్తి అన్నారు. డిప్యూటీ సీఈఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉద్యోగులతో ఆయన సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమను పరిచయం చేసుకోగా, కృష్ణమూర్తి తన ఉద్యోగ జీవితంలోని అనుభవాలను వారితో పంచుకున్నారు. ఉద్యోగ జీవితంలో ఎక్కడ పనిచేసినా బాధ్యతాయుతంగా, మనస్ఫూర్తిగా విధులు నిర్వహించడం వల్ల ఉన్నతాధికారుల ప్రశంసలు పొందినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో ఇప్పటికీ పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఉద్యోగం ఏదైనా నిబద్ధతతో నిర్వర్తిస్తేనే వ్యక్తిగత గుర్తింపుతో పాటు వృత్తిపరమైన ఎదుగుదల సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. శుభాకాంక్షల వెల్లువ డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తికి జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూసేకరణ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పనులు వేగవంతం చేయాలి

**కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

పుట్టపర్తి, జూలై 22 అనంత సూర్య; జిల్లాలో పారిశ్రామిక పార్కుల భూసేకరణ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. చిలమత్తూరు, లేపాక్షి, ముదిగుబ్బ తదితర మండలాల్లో



భూసేకరణ, ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు, ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుపై అధికారులు వివరించారు. అలాగే హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాలువ ద్వారా పుట్టపర్తి నియోజకవర్గంలోని 195 చెరువులకు నీటిని తరలించే పనుల్లో సర్వేలు, క్షేత్రస్థాయి పరిశీలనలు వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. కోర్టు వివాదాలు లేని భూములకు సంబంధించిన పరిహారం, ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి అవసరమైన భూములను ఏపీఐఐసీకి అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పనుల్లో రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి మిగిలిన సర్వేలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు

# వైసీపీ డైవర్షన్ రాజకీయాలను ఖండిస్తున్నాం: టీడీపీ నేతలు



**మెగా చేనేత క్లస్టర్‌తో 10 వేల మందికి ఉపాధి లభిస్తుందన్న వెల్లడి**

ధర్మవరం, జూలై 22 అనంత సూర్య: ధర్మవరం నియోజకవర్గంలో రూ.35 కోట్లతో ఏర్పాటు చేస-్తున్న మెగా చేనేత క్లస్టర్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేనేత అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆగస్టు 7 చేనేత దినోత్సవం సందర్భంగా "నేతన్న భరోసా" పథకంపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. అర్హులైన చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం, చేనేతకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అలాగే త్వరలో ఆదరణ పథకం ద్వారా మగ్గం పనిముట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను పక్కదారి పట్టించేలా వైసీపీ చేస్తున్న ఆరోపణలు, నిరసనలను ఖండిస్తున్నామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు పాల్గొని పలు తీర్మానాలను రాష్ట్ర పార్టీకి పంపించారు.

# రీ-సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలి

**• శాశ్వత భూ హక్కులే ప్రభుత్వ లక్ష్యం: జేసీ మౌర్య భరద్వాజ్**

పరిగి, జూలై 22 అనంత సూర్య: భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పరిగి మండలంలోని ఊటుకూరు, శిరేకోళం, పి. నర్సాపురం గ్రామాల్లో రీ-సర్వే పనులను ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సర్వే ప్రక్రియపై ఆరా తీశారు. శిరేకోళంలో ఉమ్మడి ఖాతాల పరిశీలన చేసి, ఖాతాల విభజనలో ఎలాంటి సమస్యలు





తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిగి తహసీల్దార్ కార్యాలయంలో రీ-సర్వే పురోగతిని సమీక్షించిన జేసీ, గ్రౌండ్ ట్రూథింగ్ సమయంలోనే రైతుల ఈ-కేవైసీ పూర్తి చేయాలని, పి. నర్సాపురం గ్రామంలో పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీ ప్రక్రియను రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఊటుకూరు సమీపంలోని పెన్నా నది నుంచి అక్రమ ఇసుక



రవాణాపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నదీ ప్రాంతాన్ని పరిశీలించి, అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా కఠిన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ హసీన సుల్తానా, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏసీడీపీఓ



ఓబులదేవరచెరువు, జూలై 22 అనంత సూర్య: మండలంలోని అల్లాపల్లి పంచాయతీ గౌనిపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రాన్ని ఏసీడీపీఓ రెడ్డి రమణమ్మ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సామగ్రి, గుడ్లు, పాలు తదితర సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేంద్ర పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులందరినీ నవచైతన్య యాప్‌లో నమోదు చేసి, ప్రతి చిన్నారికి ఆరోగ్య పరీక్షలు (స్క్రీనింగ్) నిర్వహించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రీస్కూల్ విద్యలో భాగంగా పీపీ--1, పీపీ--2 పుస్తకాల ద్వారా అక్షరాలు, సంఖ్యలు, ఇంగ్లీష్ అక్షరమాల, ఆటపాటలతో చిన్నారులకు నాణ్యమైన బోధన అందించాలని చెప్పారు. అలాగే ప్రతి చిన్నారి బరువు, ఎత్తును క్రమం తప్పకుండా కొలిచి గ్రోత్ చార్ట్‌లో నమోదు చేయాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో అందించే పోషకాహారంతో పాటు ఇళ్లలో కూడా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ముఖ్యంగా మునగాకు వంటి పోషకాహారం తీసుకునేలా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఏసీడీపీఓ తెలిపారు. ఈ తనిఖీలో అంగన్వాడి టీచర్ షమీం, ఆయా ధనమ్మతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు..

# అనంతపురంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు



అనంతపురం, జూలై 22 అనంత సూర్య: భారతదేశం గర్వించదగ్గ మహోనీయ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. పంచాయతీరాజ్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వై. చిన్న సుబ్బరాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజన్న, పీఐయూ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్, సబ్‌డివిజన్--1 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ బుధవారం కార్యాలయ ఆవరణను పరిశీలించి, విగ్రహ ఏర్పాటుకు చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. విగ్రహం ఏర్పాటుతో పాటు కార్యాలయ ప్రాంగణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు 15 నాటికి విగ్రహ ఏర్పాటు సహా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని వేగంగా పనులు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ వై. చిన్న సుబ్బరాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయ రూపురేఖలు మారుతున్నాయని, కార్యాలయ పరిసరాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని అధికారులు తెలిపారు.

# జూలై 24 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



**ఐక్య విద్యార్థి సంఘాల పిలుపు**

అనంతపురం, జూలై 22 అనంత సూర్య: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, పటిష్ట భద్రతా చర్యలు చేపట్టి విద్యార్థుల్లో విశ్వాసం కల్పించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణ, న్యాయమైన విద్యా వ్యవస్థ కోసం ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, అధ్యాపకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు నరసింహమూర్తి, బాబావలి, భారత్, కమల్ భాషా, వీరేష్, బద్రి, నాగేంద్ర, మహేష్, ఆకాష్, నందిష్, అనిల్, పవన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



♦ జిల్లా మహిళా అభివృద్ధి అధికారి ప్రమీల

పుట్టపర్తి, జూలై 22 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి, పెనుకొండ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని పుట్టపర్తి, ఓడీసీ, సోమందేపల్లి, పెనుకొండ, హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె. ప్రమీల తెలిపారు. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ పరిధి అభ్యర్థులకు జూలై 25 ఉదయం 10.30 గంటలకు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో, పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధి అభ్యర్థులకు జూలై 28 ఉదయం 10.30 గంటలకు పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీల్లో హాజరుకావాలని జిల్లా మహిళా అభివృద్ధి అధికారి కోరారు.

## ఎంపీఈఓల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



జిల్లా రైతు సంఘం మద్దతు

పుట్టపర్తి, జూలై 22 అనంత సూర్య: రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ అధికారులు (ఎంపీఈఓలు)కు జిల్లా రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బుధవారం




జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్యకు ఎంపీఈఓలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా రైతులకు, వ్యవసాయ శాఖకు సేవలందిస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు గౌరవ వేతనం పెంపు, సకాలంలో వేతనాల చెల్లింపు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీఈఓలు మాట్లాడుతూ, వ్యవసాయ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ గౌరవ వేతనం, జీతాల జాప్యం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాటమయ్య, లింగన్న, గోవిందరెడ్డి, చెన్నారెడ్డి, చంద్రశేఖర్, నరసారాయుడు తదితరులతో పాటు ఎంపీఈఓలు జాఫర్ వలి, రవికుమార్, రాజేష్‌బాబు, భవ్య, మీనా, నాగరాజు, రామ్మోహన్‌రెడ్డి, అనిత, గంగరాజు, నగేష్, చిన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి బిడ్డ భవిష్యత్తుకు 'తల్లికి వందనం' భరోసా



ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి, జూలై 22 అనంత సూర్య: ప్రతి బిడ్డ చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రెండో ఏడాది కూడా అమలవుతున్న ఈ పథకం ద్వారా ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేల చొప్పున తల్లి ఖాతాలో నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ.10,120.78 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అందరికీ పథకం వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా ఈ పథకాన్ని విస్తరించడం ప్రభుత్వ విద్యా సంక్షేమానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఎమ్మెల్యే సింధూర రెడ్డి పేర్కొన్నారు.

# ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని నాణ్యతతో పూర్తి చేయాలి





♦ హిందూపూర్‌లో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆకస్మిక తనిఖీ

హిందూపూర్, జూలై 22 అనంత సూర్య: జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం--2026 పురోగతిని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హిందూపూర్ శాసనసభ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన, ఇంటింటి సర్వే, గృహ గణన దరఖాస్తుల పంపిణీ, స్వీకరణ, డిజిటలీకరణ, ఓటరు నమోదు, క్షేత్రస్థాయి ధ్రువీకరణ, రికార్డుల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న అసాధారణ నమోదుల పరిష్కారాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేసి, అనర్హులైన నమోదులను నిబంధనల ప్రకారం తొలగించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అసాధారణ నమోదులు, క్షేత్రస్థాయి ధ్రువీకరణ పనులను గడువులోగా పూర్తి చేసి ఎన్నికల రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బూత్ సాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, ఎన్నికల అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎన్నికల పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు





ధర్మవరం, జూలై 22 అనంత సూర్య: ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4, యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, రైల్వే, బ్యాంకింగ్, పోలీస్, రక్షణ రంగ ఉద్యోగాలకు సంబంధించిన అర్హతలు, పరీక్షా విధానం, సిలబస్, ప్రిపరేషన్ వ్యూహాలు, సమయ నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం ప్రాముఖ్యతపై అధికారులు విద్యార్థులకు వివరించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాలు, స్కిల్ హబ్‌లు, ఉద్యోగ మార్పిడి కేంద్రం నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతున్న దశ నుంచే ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని, దినపత్రికలు చదవడం, సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు మాట్లాడుతూ, ఇటువంటి కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి నెలా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ కల్పన అధికారి కళ్యాణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సూర్యనారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల అభ్యర్థులకు ఏఐ వర్క్‌షాప్



శ్రీ సత్యసాయి జిల్లాలో తొలిసారి వినూత్న శిక్షణ

కదిరి, జూలై 22 అనంత సూర్య: జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ చొరవతో శ్రీ సత్యసాయి జిల్లాలో తొలిసారిగా పోటీ పరీక్షల అభ్యర్థులకు "పోటీ పరీక్షల సన్నాహకంలో ఏఐ సాధనాల వినియోగం" అంశంపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. కదిరిలోని వివేకానంద స్టడీ సర్కిల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం, మీడియాఫాక్స్ అకాడమీ సంయుక్తంగా ఈ శిక్షణను నిర్వహించాయి. వర్క్‌షాప్‌లో అభ్యర్థులు ఉచిత ఏఐ సాధనాల ద్వారా సబ్జెక్టులను సులభంగా అర్థం చేసుకోవడం, స్టడీ మెటీరియల్ రూపొందించడం, మైండ్ మ్యాప్స్, ఫ్లాష్ కార్డులు, ప్రజెంటేషన్లు తయారు చేసుకోవడం, స్వయంగా రాసిన నోట్స్‌ను స్కాన్ చేసి తక్షణ సూచనలు పొందే విధానాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. అంతర్జాతీయ డెవలపర్ కాన్ఫరెన్స్‌లలో పాల్గొన్న నయోనిక సురవరం ఏఐని బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా వినియోగించే మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు విలువైన శిక్షణ అందించిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు

# క్ట్రల్స్ డేటా సెంటర్‌లో పీవీకేకే ఐటీ విద్యార్థులకు 15 ఉద్యోగాలు




♦ అసోసియేట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపిక.. రూ.6 లక్షల వార్షిక వేతనం

అనంతపురం, జూలై 22 అనంత సూర్య: ఏషియాలో ప్రముఖ డేటా సెంటర్ సంస్థ అయిన క్ట్రల్స్ డేటా సెంటర్స్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ నియామకాల్లో పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (పీవీకేకేఐటీ) విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 15 మంది విద్యార్థులు అసోసియేట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపికై, ఒక్కొక్కరికి ఏడాదికి రూ.6 లక్షల వేతన ప్యాకేజీ లభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అత్యధిక మంది విద్యార్థులు ఎంపికైన కళాశాలగా పీవీకేకేఐటీ నిలిచిందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న నాణ్యమైన విద్య, శిక్షణ ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఎంపికైన విద్యార్థులను యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. బండి రమేష్‌బాబు, ప్లేస్‌మెంట్స్ డీన్ డా. భాను కిరణ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ అధికారి శ్రీమతి వహీదా, పరిపాలనాధికారి డా. మనోహర్ రెడ్డి అభినందించారు.

# నసనకోటలో ఎంజేపీ గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం







♦ మంత్రి సవిత చేతుల మీదుగా ప్రారంభం.. ఎమ్మెల్యే పరిటాల సునీత హర్షం

రామగిరి, జూలై 22 అనంత సూర్య: రామగిరి ప్రాంత ప్రజల చిరకాల కోరిక, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర ఆకాంక్షగా భావిస్తున్న నసనకోట ఎంజేపీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 680 మంది విద్యార్థినులకు క్రీడా సామగ్రి, యూనిఫాంలు, ట్రాక్‌షూలు, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ, వెనుకబడిన రామగిరి ప్రాంతంలో బాలికలకు ఉన్నత విద్య అందించాలన్న పరిటాల రవీంద్ర ఆశయం నేడు నెరవేరిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సహకారంతో జూనియర్ కళాశాల మంజూరైందని తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యారంగానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న విద్యా, బీసీ సంక్షేమ శాఖ పనులను పూర్తి చేస్తూ గురుకుల విద్యను విస్తరిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం మంత్రి సవిత వెంకటాపురంలోని పరిటాల రవీంద్ర ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు.

# ఏపీ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





### • నాణ్యమైన విద్య, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

ఆమడగూరు, జూలై 22 అనంత సూర్య: విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆమడగూర-ంలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వారి అభ్యాసన స్థాయిని తెలుసుకుని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, వంటగది పరిశుభ్రతను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తాగునీరు, రన్నింగ్ వాటర్ వంటి మౌలిక సదు-పాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ మారుతి ప్రకాష్, రెవెన్యూ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల భద్రతపై శక్తి టీం అవగాహన



### జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు

పుట్టపర్తి, జూలై 22 అనంత సూర్య; జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాల మేరకు మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌డివిజన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో శక్తి టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలు పొందే విధానం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ రుణ యాప్‌లు, బ్యాంకింగ్ మోసాల నుంచి అప్రమత్తంగా



ఉండాల్సిన అంశాలపై విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల దుష్పరిణామాలు, పోక్సో చట్టం, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలు (100/112), మహిళల హెల్ప్‌లైన్ (181), సైబర్ మోసాల ఫిర్యాదులు (1930), బాలల సహాయ నంబర్ (1098) వినియోగంపై వివరించారు. కార్యక్రమాల్లో మహిళలు, యువత, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని శక్తి టీం సభ్యులు తెలిపారు..

# విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న కూటమి ప్రభుత్వం




అనంతపురం, జూలై 22 అనంత సూర్య : రాష్ట్రంలో విద్యా రంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుని విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు పేర్కొన్నారు. "తల్లికి వందనం" పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం ద్వారా విద్యకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,120.78 కోట్ల ఆర్థిక సాయం అందించబడిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా చూడటమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. గత వైసిపి ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు ఇవ్వకుండా దగా చేసిందని ఈ సందర్భంగా విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో విద్యా రంగంలో నాణ్యత పెంపు, ఆధునిక సదుపాయాల కల్పన, డిజిటల్ విద్యా వ్యవస్థ బలోపేతం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పా-ఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించడం, సాంకేతిక విద్యను ప్రోత్సహించడం ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈటె స్వామిదాసు పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారి అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఈటె స్వామిదాసు స్పష్టం చేశారు.

# అమడగూరు తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

### ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశం

అమడగూరు, జూలై 22 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ బుధవారం అమడగూరు తహశీల్దార్ కార్యాలయాన్ని




ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలను పరిశీలించారు. మండల నలుమూలల నుంచి వచ్చే ప్రజల వినతులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రీ-సర్వే పురోగతి, భూముల రికార్డులు, మీ-సేవ ద్వారా అందుతున్న దరఖాస్తుల స్థితిపై ఆరా తీశారు. అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యాలయ ఆవరణ పరిశుభ్రతను కూడా పరిశీలించిన కలెక్టర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ మారుతి ప్రకాష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రూ.600 కోట్లతో మెగా మ్యూజియం సర్క్యూట్ ప్రతిపాదన



### సీఎంకు నివేదిక అందజేస్తానన్న చరిత్రకారుడు మైనా స్వామి

పుట్టపర్తి, జూలై 22 అనంత సూర్య: ఆంధ్రప్రదేశ్‌లో రూ. 600 కోట్ల అంచనా వ్యయంతో ఆరు ప్రపంచ స్థాయి మ్యూజియంల ఏర్పాటు కోసం సమగ్ర ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు ప్రముఖ చరిత్రకారుడు, పర్యాటక రంగ నిపుణుడు మైనా స్వామి తెలిపారు. బుధవారం పుట్టపర్తిలో మీడియాతో మాట్లాడిన ఆయన, విశాఖపట్నం, పిఠాపురం, అమరావతి, తిరుపతి, పెనుకొండ, కర్నూలులో ఒక్కో మ్యూజియంకు రూ. 100 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు ప్రతిపాదించినట్లు చెప్పారు. ప్రతి మ్యూజియం ఆయా ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను ఆధునిక డిజిటల్ సాంకేతికతతో ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించేలా రూపకల్పన చేసినట్లు వివరించారు. పెనుకొండలో విజయనగర సామ్రాజ్య వైభవం, గగన్ మహల్, శ్రీకృష్ణదేవరాయలు, తిమ్మరుసు చరిత్రకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించనున్నట్లు తెలిపారు. లేపాక్షితో కలిసి దీనిని హెరిటేజ్ ట్రయాంగిల్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదన కూడా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నివేదికను త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్‌కు సమర్పిస్తానని తెలిపారు. కేంద్ర సహాయం, రాష్ట్ర భాగస్వామ్యం, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ప్రాజెక్టును అమలు చేయవచ్చని సూచించారు. ఈ మ్యూజియం సర్క్యూట్ రాష్ట్ర చరిత్ర, వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధి, స్థానిక ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదపడుతుందని మైనా స్వామి పేర్కొన్నారు.

# విద్యార్థుల తల్లుల ఖాతాలోకి డబ్బులు జమ

**- రాష్ట్ర ముఖ్యమంత్రి, ఐటి శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మరియు ఎమ్మెల్యే సునీతమ్మ చొరవ అభినందనీయం**

**- టి.ఎన్.టి.యు.సి రాయల్ రాజు**




అనంతపురం, జులై 22 అనంత సూర్య : బుధవారం రాష్ట్రవ్యాప్తంగా తల్లికి వందనం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాలోకి డబ్బులు జమ చేయడం జరిగింది.. ఈ సందర్భంగా టి.ఎన్.టి.యు సి రాయల్ రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కు ఈరోజు పండగ రోజు లాంటిది. ఎందుకంటే ముఖ్యంగా మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మన ఐటీ మినిస్టర్ నారా లోకేష్ మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అలాగే రాప్తాడు శాసనసభ్యులు పరిటాల సునీతమ్మ చొరవతో తల్లికి వందనం కార్యక్రమం ద్వారా చదువుకుంటున్న ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేయడం జరిగింది. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధిని చేస్తూ అలాగే సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తూ, ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా తన బాధ్యతను నిర్వహిస్తున్నారు. కాబట్టి కూటమి ప్రభుత్వానికి మనం ఎంతో రుణపడి ఉంటాము. రాప్తాడు నియోజకవర్గం మా గ్రామ పంచాయతీ కక్కలపల్లి ఒక్కటే 823 విద్యార్థులకు ప్రతి విద్యార్థికి 13000 చొప్పున ఒక కోటి ఆరు లక్షల తొంబైవేలు రావడం జరిగింది. ఇదంతా మా సునీతమ్మ చొరవతో రావడం జరిగింది, మా ఎమ్మెల్యే అహర్నిశలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం అలుపెరగని పోరాటం చేస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, ఎన్నో విజయ పథకాలను ఎగిరేస్తున్న ఎమ్మెల్యేకి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు.

# కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏజీసీడీవో అనిత.



నంబులపూలకుంట, జూలై 22,అనంత సూర్య:నంబులపూలకుంట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఏజీసీడీవో అనిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పనితీరును పరిశీలించారు. తనిఖీలో భాగంగా ఏజీ సిడివో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ అమలు, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి బోధనా విధానం, విద్యార్థుల అభ్యాస స్థాయి,ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించారు. డార్మిటరీలను పరిశీలించిన ఆమె అక్కడి పరిశుభ్రత, పడకల ఏర్పాటు, తాగునీరు,పారిశుద్ధ్య సౌకర్యాలు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తనిఖీ చేశారు. అలాగే అడ్మిషన్,స్టాక్,హాజరు, మెనూ,ఆరోగ్య రికార్డులు తదితర పాఠశాల రిజిస్టర్లను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు నవీకరించాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు. ఏజీ సిడిఓ అనిత విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్య, ఆహారం,వసతి,ఇతర సౌకర్యాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. అనంతరం కేజీబీవీ సిబ్బందితో సమావేశమై నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ,పరిశుభ్రత, సమయపాలనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణ,విద్యార్థుల సంక్షేమం,విద్యా ప్రమాణాల మెరుగుదలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల ఎస్ఓ రిహానా మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మలక వేమల క్రాసులో (42) జాతీయ రహదారి ఫోర్ లైన్ రోడ్డు విస్తరణ కోసం నేషనల్ సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్ పరిశీలన

ముదిగుబ్బ,జూలై 22, అనంత సూర్య: ముదిగుబ్బ మండల పరిధిలో ఉన్న మలక వేమల క్రాస్ (42) జాతీయ రహదారి ఫోర్ లైన్ కు సంబంధించిన రోడ్డు విస్తరణ కోసం నేషనల్ సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్ సంజీవ రాయుడు బుధవారం మలక వేముల క్రాస్ లో పరిశీలించారు ఈ సందర్భంగా మలకవేముల గ్రామ దుకాణదారులు వ్యాపారస్తులు మాకు ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మాణం చేస్తే వ్యాపారాలు దెబ్బతింటాయని మలక వేముల క్రాస్ ను ఎక్కడ లేని విధంగా డిజైన్ చేయమని ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వీరిద్దరూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా డిజైన్ చేయమని అన్నారని మాలకవేమల క్రాస్ గ్రామ ప్రజలు నేషనల్ ఎస్సీ కి తెలియజేశారు మాకు ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించడం వలన మా దుకాణ వ్యాపారాలు దెబ్బతింటాయని మా జీవనాధారం ఈ వ్యాపారాల పైన బ్రతుకుతున్నామని మలక వేముల గ్రామ ప్రజల ఆవేదన చెందుతున్నారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405